క్లుప్తంగా

లక్ష్మీనృసింహస్వామికి కనకాంబరాలతో అలంకరణ



కనకాంబరాలతో అలంకరించిన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన లక్ష్మీనృసింహస్వామి గురువారం కనకాంబరాలు, తులసీదళాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 4 గంటలనుంచి స్వామివారిని ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు అలంకరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రతి గురువారం మొక్కులు తీర్చుకునేందుకు వివిధ మండలాల్లోని పలుగ్రామాలనుంచి వందలాది మంది వస్తున్నారన్నారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు గురువారం కావడంతో భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు వారీగా అభిషేకాలు, పూజలు చేశారని తెలిపారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మాట్లాడుతున్న ఎల్‌డీఎం మూర్తి

సాలూరు: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎల్‌డీఎం మూర్తి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం జగనన్న తోడు, ఫిష్ ఆంధ్ర యూనిట్లు మంజూరు, పీఎంఈజీపీ రుణాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీడీ సత్యంనాయుడు, ఏపీఎం సింహాచలం, పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం..

● మంత్రి పీడిక రాజన్నదొర



సాలూరు: కొమరాడ మండలం చోళ్లపదం శివాలయం మలుపు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరులోని అతని స్వగృహంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ, వివాహ నిశ్చితార్థానికి వెళ్లి తిరిగి వచ్చే సమయంలో ప్రమాదం జరగడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకునే విషయమై ఇప్పటికే అధికారులతో మాట్లాడాని, అలాగే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

మార్చిలోగా పనులు పూర్తి చేస్తాం..

సాలూరు: ఉపాధి హామీ పథకం ద్వారా గతంలో మంజూరై నిలిచిపోయిన అభివృద్ధి పనులన్నింటినీ మార్చిలోగా పూర్తి చేస్తామని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. గురువారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ, గతంలో 50 శాతం వరకు అయిన పనులన్నింటినీ పూర్తి చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించామన్నారు. పనుల పూర్తికి ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని చెప్పారు. చేపట్టిన పనులు ఎంబుక్ రికార్డులో ఎప్పటికప్పుడు నమదు చేయాలని తెలిపారు.

గిరిజన విద్యార్థుల ప్రతిభ



సత్తా చాటిన నీలకంఠాపురం పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు గుంటూరులో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనభరిచారని ప్రధానోపాధ్యాయులు ఆరిక గోవిందరావు, వసతి గృహ సంక్షేమాధికారి మల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం అండర్ – 14 విభాగంలో వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన 8వ తరగతికి చెందిన టి.దీపక్‌కు, 9వ తరగతి చదువుతున్న కె.లోకేష్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో పీడీ పి.చంద్రమోహన్, యోగా ఉపాధ్యాయులు టి.సునీల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రజల మధ్య వారధులే గృహ సారథులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ పాలన మరింతగా ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా గృహ సారథులు పని చేయాలని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. పార్వతీపురం మున్సిపాల్టీలోని 5వ వార్డు సచివాలయం పరిధిలో గృహ సారథులతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి విధి విధానాలను దిశానిర్దేశం చేశారు. ప్రతి వలంటీర్ పరిధిలోని గృహ సారథులు వారికి కేటాయించిన 50కుటుంబాలకు సంబంధించి అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా సేవ చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకు రావాలని సూచించారు. వలంటీర్ల ద్వారా కొత్తగా నియమితులైన గృహ సారథులను పరిచయం చేసుకుని జగనన్న కుటుంబంలో సభ్యులుగా చేరినందుకు వారికి అభినందనలు తెలియజేశారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపల్ చైర్‌పర్సన్ బోనుగౌరీశ్వరి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జేఏసీ కన్వీనర్ గొర్లి మాధవరావు, స్థానిక కౌన్సిలర్ దివ్య, కోఆప్షన్ సభ్యులు గుంట క్రాంతి, ఏఎంసీ డైరెక్టర్ గోగు గాయత్రి, సీనియర్ నాయకులు ఆదినారాయణ, జి. బాలమురళీకృష్ణ, ఎం.తవిటినాయుడు,సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేయడం వరం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: అన్నం పరబ్రహ్మస్వరూపమని అన్నదానం చేసే అవకాశం రావడం ఒక వరమని పార్వతీపురం శాసనసభ్యుడు అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలోని నెయ్యిల వీధి కూడలిలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని అనాథలకు అన్నదానం చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రతిరోజూ అనాథలు, యాచకులు, పేదలకు అన్నదానం చేయడం అన్నదానం చేసే అవకాశాన్ని ఆ భగవంతుడు కల్పించడం ఇలాంటి పవిత్రమైన కార్యక్రమంలో తనను భాగస్వామ్యం చేయడం వరంగా భావిస్తానని ఎమ్మెల్యే అన్నారు. అక్కడికి విచ్చేసిన అన్నార్తులకు ఎమ్మెల్యే అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్మన్ యిండుపూర్ గున్నేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్ కౌన్సిలర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్వారపురెడ్డి రామ్మోహనరావును సత్కరించిన టిడ్కోచైర్మన్



డాక్టర్ రామ్మోహనరావును సత్కరిస్తున్న ఏపీ టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ రామ్మోహనరావును ఏపీ టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అన్ని విభాగాల్లో ప్రతిభావంతులను గుర్తించి తగు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. వారంతా రానున్న రోజుల్లో పార్టీని బలోపేతం చేసేందుకు కృషిచేయాలని కోరారు. అనంతరం వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్‌కు నియమించిన డాక్టర్ నరేంద్రను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



వేతనదారుల హాజరు సరి చూస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

పాలకొండ రూరల్: ఉపాధి హామీ పనులు సకాలంలో పూర్తి చేసేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. పాలకొండ మండలం అర్దలి గ్రామంలో చింతలవాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. అక్కడ వేతనదారుల హాజరుపై ఆరా తీశారు. క్షేత్ర సహాయకులు విధుల్లో లేకపోవటం, మస్తర్లు అసంపూర్తిగా ఉండటాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల సందర్శనలు ఇకపై ఉంటాయన్నారు. ఈ క్రమంలో సిబ్బంది, వేతనదారులు నిర్దేశిత నిబంధనల మేరకు పనులు పూర్తి చేయాలన్నారు. అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



గెడ్డ వీదిలో తాగునీటి బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు గ్రామం గెడ్డవీధిలో తాగునీటి బోరు మరమ్మతులకు గురి కావటంతో నీటి సమస్య తలెత్తింది. గ్రామ ఉప సర్పంచ్ పడాల రామచంద్రరావు ఆధ్వర్యంలో గురువారం తాగునీటి చేతి బోరుకు మరమ్మతులు చేయించారు. దీర్ఘకాలంగా ఉన్న నీటి సమస్యకు పరిష్కారం లభించిందని స్థానికులు పేర్కొన్నారు. వేసవి నేపథ్యంలో నీటి వనరుల అభివృద్ధికి అవసరమైన చర్యలు సంబంధిత అధికారుల సమన్వంతో చేపడుతున్నట్లు ఉప సర్పంచ్ తెలిపారు.

త్వరలో బేసిక్ లిటరసీ ప్రోగ్రాం



పెద్దూరు పాఠశాలలో వివరాలు సేకరిస్తున్న సహాయ ప్రాజెక్టు అధికారి లక్ష్మి

సీతంపేట: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే వంట మనుషులు, ఆయాలకు బేసిక్ లిటరసీ ప్రోగ్రాం త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు వయోజన విద్యా సహాయ ప్రాజెక్టు అధికారి సీహెచ్ లక్ష్మి అన్నారు. మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బేసిక్, డిజిటల్ లిటరసీ నేర్పేందుకు వీలుగా అన్ని పాఠశాలలు సందర్శిస్తున్నామన్నారు. సీతంపేటలో 15 పాఠశాలలను సందర్శించామన్నారు. హిరమండలం, కొత్తూరుతో పాటు పలు మండలాలకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఎంతమంది నిరక్షరాస్యులు ఉన్నారనేది గుర్తిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడు ఉన్నారు.

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం:

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలకు ఆశక్తి ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఎస్టీ) ప్రిన్సిపాల్ కె.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు, ఇంటర్మీడియెట్ విద్యను మధ్యలో ఆపేసిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఓపెన్ ఇంటర్‌లో చేరాలనుకునేవారు దరఖాస్తుతో పాటు పదో తరగతి మెమో, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను జత చేసి ఈ నెల 27వ తేదీలోగా కళాశాలలో అందజేయాలని కోరారు. ప్రవేశం కోరే విద్యార్థులు మార్చి 1వ తేదీ నుంచి 7వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, వారికి ఏప్రిల్‌లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

గిరిజనులకు ఇళ్లు మంజూరు చేయాలి

పార్వతీపురంటౌన్: ఐటీడీఏ పరిధిలో ఉన్న నిరుపేద గిరిజనులకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసినప్పటికీ ఆర్థిక స్థోమత లేక కట్టలేకపోతున్నారని, వారందరికి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని గిరిజన అభ్యుదయ సంఘం ఐటీడీఏ పీఓను కోరింది. అలాగే ఇల్లు మంజూరు కానీ వారందరికీ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా ఐటీడీఏ పీఓ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు దుక్క సీతారాం, పల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సాలూరు: ఆటోవాలాలు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని పట్టణ ఎస్సై పాపారావు తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని రికార్డులు కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు సాగించరాదని సూచించారు. అతి వేగం, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయకూడదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మక్కువ: ఓపెన్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పదో తరగతి పాసైన వారు, ఇంటర్ మధ్యలో ఆపేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు పదో తరగతి సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డు జిరాక్సు కాపీలను ఈనెల 27వ తేదీ లోగా కళాశాలలో అందించాలన్నారు.

జీడి, మామిడితోటల పెంపకంపై అవగాహన

మక్కువ: మండలంలోని ఆళ్లగురువు గ్రామానికి చెందిన గిరిజన రైతులకు జీడి, మామిడి తోటల పెంపకంపై ఉద్యానవన శాఖాధికారి ప్రత్యక్ష భాను గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉద్యానవన తోటలు పెంచేందుకు గిరిజన రైతులకు ప్రభుత్వం రాయితీలు అందిస్తోందన్నారు.

గ్యాస్ సిలిండర్ల పంపిణీ

పార్వతీపురం టౌన్: ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంలో భాగంగా పార్వతీపురం పట్టణానికి చెందిన హెచ్‌పీ గ్యాస్ డీలర్ పెంటపాటి కామరాజు గ్యాస్ డిపో వద్ద ఉచిత గ్యాస్ కనెక్షన్‌లను స్థానిక శాసనసభ్యుడు అలజంగి జోగారావు లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంలో భాగంగా ఉచితంగా లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్‌లు అందిస్తారని ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్‌ఐ షన్ముఖరావు

గుమ్మలక్ష్మీపురం: నిబంధనలు పాటించని ఆటో చోదకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎల్విన్‌పేట ఎస్‌ఐ షన్ముఖరావు హెచ్చరించారు. ఎస్పీ విద్యాసాగరనాయుడు ఆదేశాల మేరకు ఆయన పోలీస్‌స్టేషన్ ఆవరణలో గుమ్మలక్ష్మీపురం మండలంలో గల ఆటో డ్రైవర్లతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో నడిపే ప్రతీ వ్యక్తికి లైసెన్స్ మరియు వాహనానికి ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని, యూనిఫాం ధరించి మాత్రమే వాహనం నడపాలని, పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించరాదని, అతి వేగంతో వెళ్లకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

సీతానగరం: మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనచోదకులు రోడ్డు నిబంధనలు, జాగ్రత్తలు పాటించాలని రోడ్డు రవాణా శాఖ అధికారులు, పోలీసులు కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర రహదారిలో హనుమాన్ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్స్, వాహన చోదకులతో ఆర్‌టీ అధికారులు రమేష్, శశిభూషణరావు, ఎస్సై కె నీలకంఠం రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై నీలకంఠం మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా వాహనాలు నిబంధనలకు లోబడి నడపాలని నిబంధనలు అతిక్రమించిన వాహన చోదకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు వాహనాలను అన్ని రూట్లలో తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో, మ్యాక్సీ డ్రైవర్లు సహకరించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలోని స్థానిక ఉన్నత పాఠశాలలో మార్చి 13న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ ఎన్వీ రమణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటింగ్ చేయడానికి వచ్చే ఓటర్లకు వెలుతురు, గాలి, రాకపోకలకు వనరులను పరిశీలించినట్లు చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలంలోని 1,182 మంది (పురుషులు 824, మహిళలు 358 మంది) ఓటర్లు వారి ఓటుహక్కును వినియోగించడానికి 82వ పోలింగ్ బూత్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన వసతులు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కరుణాకర్, వీఆర్వో పి కుమార్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలి

పార్వతీపురంటౌన్:



వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలని కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్ పోటీ చేస్తున్నారని, మార్చి 13న జరగనున్న ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను అందజేసి ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి భద్రత నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై పాపారావు

● డీఎస్పీ ఎ. సుభాష్

పార్వతీపురంటౌన్: రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని డీఎస్పీ ఎ.సుభాష్ కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఫ్లైఓవర్, కొత్తవలస జంక్షన్‌ల వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత నియమాలు పాటించని వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ విధిగా ధరించాలని, వాహన ధృవపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లు ఓవర్‌లోడ్‌తో వెళ్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెండింగులో ఉన్న చలానాలను తక్షణమే చెల్లించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని కోరారు. మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడితే వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తామని, అయినా వినకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై సీతారాం, ట్రాఫిక్ ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతపండు సేకరణలో గిరిజనులు



మూలబిన్నిడిలో చింతపండు తొక్కలను తీస్తున్న గిరిజన మహిళలు

గుమ్మలక్ష్మీపురం: ఈ సీజన్లో విరివిగా లభ్యమయ్యే చింతపండు సేకరణలో గిరిజనులు బిజీగా ఉన్నారు. చింతపండు దిగుబడి ఈ ఏడాది బాగుండటంతో ఉత్సాహంగా దిగుబడొచ్చిన పంటను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. చింత చెట్ల నుంచి చింత పండ్లను ఏరి, వాటిని ఎండలో బాగా ఎండేంత వరకు ఎండబెట్టి, తొక్కలను తొలగించి గ్రామాలకు వస్తున్న వ్యాపారులకు విక్రయిస్తూ గిరిజనులు లబ్ధి పొందుతున్నారు. ఇదిలా ఉండగా కిలో చింతపండును రూ.32.40 ధరకు కొనుగోలు చేస్తామని చెప్పుకొస్తున్న జీసీసీ/జీసీఎంఎస్ అధికారులు, కొనుగోళ్లను ఇంకా ప్రారంభించలేదు. మరి కొద్ది రోజుల్లో చింతపండు కొనుగోళ్లు ప్రారంభిస్తామని జీసీసీ అధికారులు చెబుతున్నారు.

పెదఖర్జలో ఫ్యామిలీ డాక్టర్

గుమ్మలక్ష్మీపురం:



పెదఖర్జలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య సేవలు

మండలంలోని పెదఖర్జ గ్రామంలో గురువారం తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి అభిలాష్, 104 అంబులెన్స్ వైద్యాధికారి జి.ప్రభాకరరావు ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను అందించారు. ఇంటింటికి వెళ్లి చిన్నారులు, నడవలేని వృద్ధుల ఆరోగ్యంపై ఆరా తీసి, మందులను అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం పుష్పగిరి ఆస్పత్రి ఆప్తాల్మిక్ అసిస్టెంట్ బి.శంకరరావు 56 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 19 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ఎన్వీ ప్రకాష్, సీహెచ్‌ఓలు పి.దివ్యభారతి, ఎం.స్వాతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వమే ఇళ్లను నిర్మించాలి



ఎం.డి లక్ష్మీశాకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనాభ్యుదయ సంఘం నాయకులు

కురుపాం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజనులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను ప్రభుత్వమే చొరవ చూపి నిర్మించి ఇచ్చేలా చర్యలు చేపట్టాలని గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎం.డి లక్ష్మీశాకు విన్నవించారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ గిరిజనులకు ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసినా ఆర్థిక స్థోమత లేక పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టలేకపోతున్నారని తెలిపారు. అలాగే ఇళ్లు మంజూరు కాని వారిని కూడా గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఎండీని కలిసిన వారిలో గిరిజన సంఘం నాయకులు దుక్క సీతారాం, పల్ల సురేష్ తదితరులు ఉన్నారు.